
సాక్షి వికారాబాద్

గురువారం । 27 । జూలై । 2023



పత్తి విపత్తేనా...?

పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలో వర్షపు నీరు నిలిచింది. 8లో▸



జుంటుపల్లి ఉధృతం..

జుంటుపల్లి జలాశయం అలుగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నీటి ఉధృతి ఎక్కువ కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. 8లో▸



సేవలకు గుర్తింపేదీ?

ముఖ్యమంత్రి, మంత్రుల హామీలు నెరవేరక పోవడంతో సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల్లో నిరాశ నెలకొంది. 9లో▸

న్యూస్‌రీల్

వసతి గృహాల పరిశీలన



బీసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

కొడంగల్: పట్టణంలోని వసతి గృహాలను జిల్లా అధికారులు బుధవారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బీసీ, ఎస్టీ, ఎస్సీ వసతి గృహాలను బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉపేంద్ర, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మోజెస్‌లు తనిఖీ చేశారు. భవనాల స్థితిగతులు, విద్యార్థులకు అందించే మెనూ, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, వంట గదులను పరీక్షించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ నారాయణరెడ్డికి నివేదిక ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహాల వార్డెన్లు రాధిక, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడిని చావబాదిన హెడ్ కానిస్టేబుల్‌కు మెమో

పది రోజుల్లో వివరణ ఇవ్వాలని సీఐ ఆదేశం

బషీరాబాద్: పోలీస్‌స్టేషన్‌కు పిలిచి కార్మికుడిని చావబాదిన హెడ్ కానిస్టేబుల్ మల్లేశంపై పోలీసుశాఖ చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు తాండూరు రూరల్ సీఐ రాంబాబు మెమో జారీ చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ బుధవారం తెలిపారు. అప్పుగా ఇచ్చిన డబ్బులు ఇవ్వలేదని అనసూయ అనే మహిళా ఇచ్చిన ఫిర్యాదుతో వడ్డే నగేశ్ అనే కార్మికుడిని ఈ నెల 18న పీఎస్‌కు పిలిచి చావబాదడంతో అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయారు. అతడు వారం రోజులుగా ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై మీడియాలో వచ్చిన కథనాలకు స్పందించిన ఎస్పీ తాండూరు రూరల్ సీఐని ఆదేశించడంతో మెమో జారీ చేశారు. పది రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఐటీఐలో ప్రవేశాలకు 31 వరకు గడువు

వికారాబాద్ అర్బన్: ఐటీఐ కోర్సులలో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు గాను ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కోర్సులలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను మాత్రమే స్కాన్ చేసి వెబ్‌సైట్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 91774 72488, 85558 65421 నంబర్లను సంప్రదించాలన్నారు.

దైవభక్తి కంటే దేశభక్తి గొప్పది



భరతమాత, సైనిక వేషధారణలో విద్యార్థినులు

తాండూరు టౌన్ : దైవభక్తి కంటే దేశభక్తి ఎంతో గొప్పదని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప అన్నారు. పాకిస్థాన్ సైన్యంపై భారత సైన్యం విజయం సాధించిన దానికి గుర్తుగా నిర్వహించే కార్గిల్ విజయ్ దివస్‌ను తాండూరులోని టీఎస్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై అమర జవాన్లకు ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. దేశ సైన్యంలో చేరి సేవ చేసేందుకు యువతీయువకులు ముందుకు రావాలన్నారు. రిటైర్డ్ ఆర్మీ అధికారి వెంకటయ్య మాట్లాడుతూ నిజాయితీ గల సేవా కార్యక్రమం ఆర్మీ ఉద్యోగమన్నారు. తన ఇంట్లోనే ఐదుగురు ఆర్మీలో ఉండటం గర్వించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ వేణుగోపాల శర్మ, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.



లక్నాపూర్ ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

గంగమ్మ తల్లికి పూజలు

పరిగి మండల పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి బుధవారం సందర్శించారు. లక్నాపూర్ ప్రాజెక్టు అలుగు పారడంతో గంగమ్మతల్లికి హారతినిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రతీ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండుతున్నాయన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రవీణ్‌రెడ్డి, రవికుమార్ తదితరులున్నారు.

– పరిగి

బాలింతలకు కుళ్లిన గుడ్లు.. విరిగిన పాలు

- అడాల్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఘటన

యాలాల: మండల పరిధిలోని అడాల్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రం నుంచి బాలింతలకు సరఫరా చేసిన గుడ్లు, పాలు చెడిపోయి ఉండటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అంగన్‌వాడీ కేంద్రం నుంచి టేక్ హోం రేషన్‌లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తుంటారు. మంగళవారం పలువురి బాలింతలు, గర్భిణులకు పాలు, గుడ్లు పంపిణీ చేశారు. గుడ్లు కుళ్లిపోయి, పాల నుంచి దుర్వాసన వస్తుండటంతో ఆందోళన చెందారు. ఇదే విషయాన్ని గ్రామ సర్పంచ్ శేఖర్ దృష్టికి తీసుకువచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు, పాలు సరఫరా చేసే వ్యక్తులను ఈ విషయమై బుధవారం నిలదీస్తే, నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని సర్పంచ్ పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఉన్నతాధికారులు స్పందించి పౌష్టికాహార పంపిణీలో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



కుళ్లిన గుడ్డు



చెడిపోయిన పాలు

వివాదాలే ఇంపు.. వీధులన్నీ కంపు

పట్టణాల్లో పాలన పడకేసింది. కౌన్సిలర్లు, చైర్‌పర్సన్లు ఒకరితోఒకరు పంచాయితీ పెట్టుకోవడం తప్ప పాలనపై దృష్టి సారించడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ కమిషనర్లు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. మరోవైపు పది రోజులుగా కురుస్తున్న వానలు వీటికి తోడవటంతో వీధులన్నీ కంపుకొడుతున్నాయి. ఇళ్ల మధ్య, రోడ్లపైనా మురుగు పేరుకుపోతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు.

పట్టణాల్లో లోపించిన పారిశుద్ధ్యం

- రోడ్లపైనే పారుతున్న మురుగు
- ఇష్టారాజ్యంగా చెత్తపారబోత
- కురుస్తున్న వర్షాలతో వ్యాపిస్తున్న దుర్గంధం
- రూ.కోట్లు వెచ్చిస్తున్నా తీరని సమస్యలు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న పాలకవర్గాలు
- రోగాల బారిన ప్రజలు



పరిగిలోని వేంకటేశ్వర టెంపుల్ కాలనీకి వెళ్లే దారి దుస్థితి..

వికారాబాద్: జిల్లాలోని మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం లోపించింది. వర్షపునీరు, డ్రైనేజీ రోడ్లపైనే ప్రవహిస్తుండటంతో జనం నడిచేందుకు కూడా వీలులేని దుస్థితి. ఉన్నతాధికారులు సైతం పర్యవేక్షణ గాలికొదిలేయడంతో ఆడిందే ఆటా.. పాడిందే పాట అన్న చందంగా మున్సిపల్ అధికారుల పనితీరు తయారయ్యింది. పేరుకే తడిపొడి చెత్తా అంటూ ఊదరగొడుతున్న మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య సమస్యను విస్మరిస్తున్నారు. పట్టణాల్లోని కాలనీల్లో అడుగడుగునా దుర్గంధం వ్యాపిస్తుండటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వరుసబెట్టి కురుస్తున్న వర్షాలతో రోగాల బారిన పడాల్సి వస్తోందని ఆందోళనకు గురవుతున్నారు.

రోజురోజుకు సమస్య అధికం

పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్య రోజురోజుకు అధికమవుతూనే ఉంది. కురుస్తున్న వర్షాలతో సమస్య మరింత తీవ్రరూపం దాలుస్తోంది. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొంత మెరుగుపడగా పట్టణాల్లో మాత్రం ఇంకా అధ్వానంగానే కనిపిస్తోంది.చాలా వరకు చెత్త సేకరించకుండా ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తున్నారు. సేకరించిన చెత్తను సైతం ఇష్టారాజ్యంగా పట్టణ శివారు ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్నారు.దీంతో పరిసర ఆవాసాల్లో నివసించే ప్రజ లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇష్టారాజ్యంగా డంప్ చేస్తున్న చెత్త కుళ్లిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. ఫలితంగా దోమలు, ఈగలు వృద్ధిచెంది పరిసర ప్రాంతాల ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. రోజు ఉదయం లేవగానే తడిపొడి చెత్త వేరువేరుగా వేయండని మున్సిపాలిటీ వాహనాలతో ఊదరగొడుతున్న యంత్రాంగం ఆ దిశగా చర్యలు కనిపించటంలేదు. తడిపొడి చెత్తనంత ఒకే చోట సేకరించి శివారు ప్రాంతాలకు తరలించి డంప్ చేస్తున్నారు. నిధుల దుర్వినియోగం చేయడం.. లేదంటే ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవటానికే పాలక వర్గం పరిమితమవుతుండగా కమిషనర్లు సందులో సడేమియా అన్నట్టుగా అందినకాడికి దండుకుంటూ చేయాల్సిన పనుల బాధ్యత తమది కానట్టు వదిలేస్తున్నారు.

ఇళ్ల మధ్యే మురుగు..

నివాసాల మధ్య మురుగు పేరుకుపోయి పందులు, దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధులు అధికారులు చూసిచూడనట్లే వ్యవహరిస్తున్నారేకాని పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదు. ఒక్కో మున్సిపాలిటీలో రూ. కోట్లలో నిధులు ఖర్చు చేశామని చెబుతున్నా.. సమస్యలు మాత్రం అలాగే దర్శనమిస్తున్నాయి. అధికారులు, కౌన్సిలర్లు అని తేడా లేకుండా ఒకరిపై ఒకరు గొడవలకు దిగడం.. అందినకాడికి దండుకోవటం తప్ప ఎక్కడా సమస్యలపై దృష్టి సారించిన దాఖలాలు కనిపించటంలేదు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నాలుగు మున్సిపాలిటీలు ఉండగా చెత్త సేకరణ విధానంలో అన్నింటిలో అస్తవ్యస్తంగానే తయారయ్యింది. అధికారులు చెబుతున్నా దానికి వాస్తవ పరిస్థితులకు ఎలాంటి పొంతన కనిపించటంలేదు. తడి పొడి చెత్త వేరు చేయడం కోసం మున్సిపాలిటీల్లో చెత్త బుట్టలు అందజేస్తున్నప్పటికీ వేరుచేసే విషయంలో అవగాహన కల్పించటంలో విఫలమవుతున్నారు. దీంతో చెత్తనంతా ఒకే చోట పడేస్తున్నారు. గతంలో తాండూరు, పరిగి , వికారాబాద్ మున్సిపాలిటీల్లో కంపోస్టు ఎరువుతయారీ యూనిట్లు నెలకొల్పి ఎరువులు తయారు చేశారు. తయారు చేసిన ఎరువును పట్టణ ప్రకృతి వనాల్లో, నర్సరీల్లో పెంచిన మొక్కల కోసం వాడారు. కొద్ది రోజుల పాటు కంపోస్టు ఎరువులు తయారు చేసిన మున్సిపల్ యంత్రాంగం కొద్ది రోజులకే ఆ తతంగం మూలకు పడేశారు.

స్థలాలు గుర్తించండి

- జీపీ భవన నిర్మాణాల పనులు వేగిరం చేయాలి
- లేదంటే వేరే గ్రామాలకు కేటాయిస్తాం
- కలెక్టర్ నారాయణరెడ్డి కీలక నిర్ణయం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష

వికారాబాద్ అర్బన్: గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలకు అవసరమైన స్థలాలను రెండు రోజుల్లో గుర్తించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలు నుంచి గ్రామ పంచాయతీ భవనాలు, క్రీడా ప్రాంగణాలు, హరితహారం, మన ఊరు– మనబడి, ఆయిల్ ఫాం ఉద్యాన పంటలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు స్థల సేకరణ జరగని జీపీలు పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. లేకుంటే మంజూరైన భవనాలను రద్దు చేసి వేరే గ్రామపంచాయతీకి కేటాయిస్తామని హెచ్చరించారు. ప్రతి గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిందని, ఇప్పటివరకు కొన్ని పంచాయతీలలో స్థల సేకరణ జరగలేదన్నారు. వెంటనే స్థల సేకరణతో పాటు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేస్తేనే కార్యదర్శుల సర్వీస్ రెగ్యులరైజేషన్ కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అవెన్యూ ప్లాంటేషన్ లేని రోడ్డు ఎక్కడా కనిపించరాదన్నారు. నాటిన ప్రతి మొక్కను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. హరితహారం పై నిర్లక్ష్యం వహించిన సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

డీడీలు సేకరించండి

జిల్లాలో ఆయిల్ ఫామ్ తోటల పెంపకంలో భాగంగా 3వేల ఎకరాల లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 691 ఎకరాలను గుర్తించామని చెప్పారు. గుర్తించిన రైతుల నుంచి మొక్కకు 20 రూపాయల చొప్పున డీడీలను సోమవారం వరకు సేకరించాలని అన్నారు. మిగతా లక్ష్యాన్ని కూడా పూర్తిచేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మన ఊరు - మన బడిలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేసేందుకు ఎంపీడీవోలు, ఏఈలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ డీఆర్డీఓ కృష్ణన్, డీపీఓ తరుణ్ కుమార్, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో..

జిల్లాలో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అధికారులందరూ అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తో కలిసి జిల్లాలోని ఆయా శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ పలు సూచనలు సలహాలు చేశారు.



ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

హాస్టళ్లలో మెనూ తప్పనిసరి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- అన్ని వసతులూ కల్పించాలి
- వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

పరిగి: వసతిగృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలికల, బీసీ జూనియర్ కాలేజీ హాస్టళ్లను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ వార్డెన్లు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. అన్ని వసతులను కల్పించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి లోటు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. నిత్యావసర సరుకులు నాణ్యమైనవి ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలన్నారు. మంచి విద్యనందించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. హాస్టళ్లలో ఎలాంటి ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే వార్డెన్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ హాస్టల్‌లో నిత్యావసర సరకులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

డబుల్ బెడ్రూంలు ఇంకెప్పుడిస్తారు?

- కేసీఆర్ సర్కార్‌వి మాటలే..
- కాంగ్రెస్ హయాంలో ఎంతో మందికి ఇళ్లు ఇచ్చాం
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా ఏ ఒక్కరికీ డబుల్ బెడ్రూం ఇవ్వలేదని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని తుంకులగడ్డలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లను బుధవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మాయమాటలు చెబుతున్నారన్నారు. డబుల్ బెడ్రూంలు ఇస్తామని చెప్పి సంవత్సరాలు గడుస్తున్నా పంపిణీ చేయడం లేదన్నారు. డబుల్‌బెడ్రూంలు నాణ్యతలేకుండా నిర్మిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గానికి సుమారు 42వేల ఇళ్లను మంజూరు చేయించామన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇస్తామన్నారు. కట్టుకునే వారికి రూ.5లక్షలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, కౌన్సిలర్ శ్రీనివాస్, ఆయా మండలాల అధ్యక్షులు ఆంజనేయులు, విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు అక్బర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

‘కంటి వెలుగు’ నిధులు హుష్‌కాకి!

- మంజూరైనా ఇవ్వని వైద్యాధికారులు
- అయోమయంలో నిర్వహణ ఏజెన్సీలు

పూడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమం నిర్వహణ ఏజెన్సీలకు శాపంగా మారింది. జిల్లాలో 42 టీమ్‌లు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వహణ కోసం వచ్చిన నిధులు వైద్యశాఖ అధికారులు గోల్‌మాల్ చేశారని నిర్వాహకులు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరైనా నిర్వహణ నిధులు ఇవ్వడం లేదని ఏజెన్సీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కంటి వెలుగు నిర్వహించిన ప్రతి గ్రామంలో రోజూ రూ.2,500 ఇస్తుంది. ఇందుకు సంబంధించిన నిధులను ప్రతి పీహెచ్‌సీకి లక్ష చొప్పున జమ చేసింది. మండలంలోని కొన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు నిర్వాహకులకు భోజనం, వసతి కల్పించారు. మిగతా గ్రామాల్లో నిర్వహణ ఏజెన్సీలు భోజనం, నిర్వహణ కోసం సొంత ఖర్చులు పెట్టుకున్నారు. కార్యక్రమం ముగిసి నెలలు గడుస్తున్నా నేటికీ డబ్బులు రాలేవని సర్పంచ్‌లు, నిర్వహణ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంటి వెలుగు శిబిరం నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

సొంత డబ్బులు వెచ్చించాం

గ్రామంలో కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు నిర్వహించారు. రోజూ అల్పాహారంతో పాటు భోజనం అందించాం. పంచాయతీ కార్యాలయం ఆవరణంలో టెంట్ వేశాం. రూ.26 వేల వరకు ఖర్చు అయ్యింది. నిధులు మంజూరైనా డబ్బులు ఇవ్వడం లేదు.

– రాములు, సర్పంచ్, చీలాపూర్

నిధులు రాలేవు

కంటివెలుగు కార్యక్రమానికి సంబంధించి నిధులు రాలేవు. పీహెచ్‌సీ ఖాతాల్లో జమ కాలేవు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డబ్బులు రాగానే నిర్వాహకులకు అందజేస్తాం. వివిధ అవసరాలకు సంబంధించి ఆస్పత్రి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

– డాక్టర్ సుధాకర్‌రెడ్డి, పీహెచ్‌సీ, పూడూరు

రహదారులకు ఇరువైపులా మొక్కలు

- ఈజీఎస్ ఏపీడీ సరళకుమారి

బొంరాస్‌పేట: రహదారులకు ఇరువైపులా ఉండే అవెన్యూ పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటడం ఉధృతంగా జరుగుతోందని ఈజీఎస్ ఏపీడీ సరళకుమారి అన్నారు. ఈమేరకు బుధవారం మండల పరిధిలోని తుంకిమెట్ల, నాందార్‌పూర్, పరిశీలించిన దుద్యాల మండల పరిధిలోని లగచర్ల, సంద్రకుంటతండా, ఈర్లపల్లి, రోటిబండతండా, చిల్మల్‌మైలారం, నాజ్‌ఖాన్‌పల్లిని ఆమె సందర్శించారు. హరితహారంలో మొక్కలు నాటుతున్న పనులను పరిశీలించారు. మొక్కల నాటి సంరక్షించాలని సూచించారు. ఉపాధి కూలీలు ఈ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో ఏపీఓ మల్లికార్జున్, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

ధారూరు ఎస్‌ఐ-2గా రాణి



సీఐకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఐ-2 రాణి

ధారూరు: ధారూరు ఎస్‌ఐ–2గా హెచ్ రాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏడాది నుంచి ఇక్కడ ఎస్‌ఐ–2 పోస్టు ఖాళీగా ఉంది. రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎస్‌ఐ–2ని నియమించినట్లు సమాచారం. రాణి సంగారెడ్డి జిల్లా భరోసా కేంద్రంలో పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమె ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌తో కలిసి సర్కిల్ సీఐ రామకృష్ణను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాండూరు టౌన్: పట్టణంలోని శివాజీ చౌక్‌లో గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. పట్టణ ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన ప్రకారం.. నిత్యం భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న సుమారు 50ఏళ్ల వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు గుర్తించామన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే తాండూరు పోలీసులను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని తాండూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచామని చెప్పారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

గాయపడిన డ్రైవర్

యాలాల: ఎదురుగా వస్తున్న ఆటోను ఓ లారీ ఢీకొట్టింది. ఈ ఘటన మండల పరిధిలోని చెన్నారం గేటు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కొడంగల్ నుంచి తాండూరు వైపు ప్రయాణిస్తున్న ఓ లారీ స్క్రాప్ కొనుగోలు చేసే ఓ ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వింత వ్యాధితో లేగదూడల మృతి



లేగదూడ కళేబరం

ధారూరు: మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో బుధవారం రెండు లేగదూడలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బోయిని హన్మయ్య, కావలి వెంకటయ్యకు చెందిన ఒక్కో లేగదూడ వారం రోజులుగా అస్వస్థతకు గురయ్యాయి. పశువైద్య సిబ్బంది వైద్యం చేసిన కోలుకోలేకపోయాయని బాధితులు తెలిపారు. వీటి శరీరాలపై కంతులు వచ్చి మేత మేయలేవని వివరించారు. వ్యాధి లక్షణాలను పశువైద్య సిబ్బంది గుర్తించలేకపోయారని.. గ్రామంలోని ఇతర పశువులకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి పశువుల మరణాలను అరికట్టాలని కోరారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రాంరెడ్డి

అనంతగిరి: వికారాబాద్ ప్రాంతంలో దెబ్బతిన్న పంటలను బుధవారం రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి పరిశీలించారు. మండల పరిధిలోని పులుమద్ది గ్రామంలో ఆయన సర్పంచ్ మాధవరెడ్డితో కలిసి పంటనష్టం అంచనావేశారు. ఆయన వెంట ఏఈఓ అనిల్‌కుమార్, నాయకులు గయాజ్, భాస్కర్, పాండు తదితరులున్నారు.



ఎన్కేపల్లిలో పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు

పత్తి... విపత్తేనా?

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- పంటల్లో నిలిచిన వర్షపు నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు

మోమిన్‌పేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలో వర్షపు నీరు నిలిచింది. దీంతో పత్తి ఆకులు మాడిపోతున్నాయి. పంట నుంచి నీరు వెళ్లకపోవడంతో మొక్కలు కుళ్లిపోతున్నాయి. ప్రారంభంలో వర్షాలు లేక విత్తిన విత్తనాలు 20రోజుల వరకు మొలకెత్తలేదు. దీంతో రైతులు మరో సారి విత్తనాలు కొనుగోలు చేసి విత్తుకొన్నారు. మొలకలు చిన్నవిగా ఉండడం.. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు పత్తి మొక్కలను పేనుబంక పీడుస్తోందని వాపోతున్నారు. మందులు స్ప్రే చేసేందుకు కూడా వీలు లేక అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ పత్తికి రూ.7,020 మద్దతు ధర ప్రకటించడంతో ఇప్పటికే 80శాతం రైతులు పత్తిసాగుకే మొగ్గు చూపారు. ఇతర సంప్రదాయ పంటలను సాగు చేసేందుకు అడవి పందులు, నెమలిలతో ఇబ్బందుల వల్ల సాగుకు దూరమవుతున్నారు. పెసర, మినుము, సోయ సాగు పదుల ఎకరాలకు పడిపోయింది. మొక్కజొన్నలో అంతర పంటగా కందిని సాగు చేస్తున్నా తక్కువ విస్తీర్ణంలోనే. మొక్కజొన్న పంటను అడవి పందుల నుంచి విత్తింది మొదలు మార్కెటుకు తరలించేవరకు కాపాల కాయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. జొన్నసాగు పూర్తిగా తగ్గిపోయింది. వ్యవసాయాధికారులు గ్రామాలను సందర్శించి ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

కష్టపడే వారికి తగిన గుర్తింపు



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పార్టీకోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన వంద మంది బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం టీఆర్‌ఆర్ నివాసంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఉచిత హామీలిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ నాయకులతో సమాన స్థాయి కల్పిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతీ ఒక్కరు కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

పరిగి: నేరాలను నియంత్రించేందుకే కార్డెన్ సెర్చ్ లు నిర్వహిస్తామని డీఎస్పీ కరుణాసాగర్ రె డ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో 110 ద్విచక్రవాహనా లు, 15త్రీవీల్స్, నాలుగు కార్లను సీజ్ చేశారు. సరైన ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం వాహనాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎ స్పీ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు నిబంధనల ను పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటరామయ్య, ఎస్సైలు పాల్గొన్నారు.

డ్రైవర్ నిద్ర మత్తు.. కోళ్ల వ్యాన్ బోల్తా

చేవెళ్ల: డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా కోళ్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కందవాడ బస్ స్టేజీ వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ నుంచి కోళ్ల లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం కందవాడ బస్టేజీ వద్ద బోల్తా పడింది. డీసీఎం రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో హైదరాబాద్– బీజాపూర్ రూట్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు జేసీబీ సాయంతో వాహనాన్ని పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘటనలో 80శాతం కోళ్లు మృతి చెందాయి. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వర్షాలకు కూలిన ఇళ్లు



కూలిన శివరాజమ్మ ఇల్లు



కూలిన మాడప్ప ఇల్లు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు మంగళవారం రాత్రి మూడు ఇళ్లు కూలిపోయాయి. బాధితులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గాజుల శివరాజమ్మ ఇల్లు వర్షం తాకిడికి కూలిపోయింది. ఆమె కొద్ది రోజులుగా తాండూరులోని బంధువుల ఇంటికి వెళ్లడం, అదృష్టవశాత్తు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. ఇదే గ్రామానికి చంద్రయ్య, కుర్వ పూజారి మాడప్ప ఇళ్లు కూలిపోయాయి. కాగా మాడప్ప కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

అన్నదాతకు సర్కారు బీ‘ధీ’మా

- రైతుబీమా దరఖాస్తుకు ఆగస్టు 10 చివరి తేదీ
- 18 ఏళ్లు నిండిన వారందరూ అర్హులే
- పాసు పుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలిస్తే చాలు
- ఒక్కో రైతుకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్



షాబాద్ మండలం మక్తగూడలో పొలం పనులు చేస్తున్న రైతులు

షాబాద్: రైతుబీమా పథకానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో దరఖాస్తు చేసుకోని వారు, కొత్తగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఎలాంటి ప్రీమియం లేకుండా భూమి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను సంబంధిత ఏఈఓకు అందజేయాలి. ఈనెల 10 వతేదీ నుంచి దరఖాస్తులు స్వీకరింస్తుండగా ఆగస్టు 5వ తేదీ వరకు గడువు విధించారు. కాగా ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ బీమా పథకం రైతు కుటుంబాలకు ఎంతో ధీమా ఇస్తోంది. ఏదైనా ప్రభుత్వ పథకం అందాలంటే పలుకుబడి ఉన్న వారికి ఆశ్రయించడమో, దళారులను నమ్ముకోవడమో వంటివి లేకుండా దీన్ని అమలు చేస్తున్నారు. ఏదైనా కారణంతో రైతు మరణిస్తే పది రోజుల్లో బాధిత కుటుంబానికి (నామినీ) రూ.5 లక్షలు అందజేస్తున్నారు. గతంలో రైతులు మరణిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడేవి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ఎంతో మందికి అండగా నిలుస్తోంది.

ఒక్కొక్కరికి రూ.3,555 ప్రీమియం

పథకం ప్రారంభంలో ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.2,271.50 ప్రీమియంను ఎల్‌ఐసీకి చెల్లించింది. 2019 నుంచి ప్రీమియం పెరగడంతో ప్రస్తుతం ఒక్కో రైతుకు రూ.3,555.94 చెల్లిస్తుంది. జిల్లాలోని 27 మండలాల పరిధిలోని రైతు బీమా పథకం అమలు చేస్తున్నారు. పథకం ప్రారంభించిన 2018 ఆగస్టు 15 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 6వేల మందికి పైగా రైతులు వివిధ కారణాలతో మృతి చెందారు. వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున రూ.366.53 కోట్లు అందజేసినట్లు వ్యవసాయశాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

అంతా పారదర్శకం

రాష్ట్ర ప్రభుత్వం 2018 ఆగస్టు 15వ తేదీ నుంచి రైతు బీమా పథకాన్ని అమలు చేస్తోంది. 18 సంవత్సరాల వయసున్న రైతుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అర్హులైన వారికి బీమా బాండ్లు అందజేశారు. రైతులపై ఎలాంటి ఆర్థికభారం లేకుండా ప్రభుత్వమే ఎల్‌ఐసీకి రైతుల పేరున బీమాకు సంబంధించిన ప్రీమియం సొమ్ము జమ చేసింది. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కఠిన నిబంధనలున్నాయి. ఈ పథకంలో పేరు నమోదైన రైతు ఏ కారణంతో సొమ్ము 10 రోజుల్లో అందిస్తూ పారదర్శకతను పాటిస్తున్నారు. నామినీగా ఉన్న వారికి రూ.5 లక్షల బీమా సొమ్మును బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు.

గొప్ప పథకం



గతంలో రైతులు మరణిస్తే వారి కుటుంబాల పరిస్థితి చాలా దయనీయంగా ఉండేది. వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. రైతుల కోసం అమలు చేస్తున్న బీమా పథకం ఎందరో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. రైతు మరణించిన 10 రోజుల వ్యవధిలోనే రూ.5 లక్షలు అందిస్తున్న రైతు బీమా పథకం ఎంతో గొప్ప పథకం.

– రాపోల్ నర్సింహులు, రైతు మల్లారెడ్డిగూడ

దరఖాస్తు చేసుకోవాలి



రైతు బీమా పథకానికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైన రైతులు పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం అందించి ఆయా గ్రామాల ఏఈఓల దగ్గర వివరాలు నమోదు చేయించుకోవాలి. రైతులు ఏదేని కారణంతో మరణిస్తే, విషయం ఫోన్‌లో సమాచారం ఇచ్చినా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. పది రోజుల్లోగా నామినీగా ఉన్న వ్యక్తి బ్యాంకు ఖాతాలోల బీమా సొమ్ము రూ.5 లక్షలు జమవుతున్నాయి.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

ఒక్క ‘డబుల్’ ఇల్లు ఇవ్వలేదు

- తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ చేసింది శూన్యం
- మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

అనంతగిరి: తొమ్మిదేళ్ల పాలనలో ప్రభుత్వం జిల్లా పరిధిలో ఒక్క డబుల్ బెడ్రూం ఇవ్వలేదని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ మండిపడ్డారు. బుధవారం ఆయన వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సమీపంలో నిలిచిపోయిన డబుల్ బెడ్రూం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వర్గీయ వైఎస్సార్ హయాంలోనే పేదలకు రాజీవ్‌గృహకల్ప, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో మున్సిపల్ పరిధిలో 12 కాలనీలు ఏర్పాటు చేశామని చెప్పారు.

కాంగ్రెస్ హయాంలో సొంతిళ్లు: టీఆర్‌ఆర్

బీఆర్‌ఎస్ అబద్దపు మాటలు చెబుతూ ప్రజలు మోసం చేస్తోందని ఆరోపించారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టి.రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్‌లో పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్లను చూస్తే సీఎం కేసీఆర్‌కు పేదలపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు.

‘వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయం’

అనంతరం పీసీసీ అధికార ప్రతినిధి సామ రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌లలో డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చి వికారాబాద్‌లాంటి వెనుకపడిన జిల్లాలో పేదలకు ఎందుకు ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. మాజీ చైర్మన్ సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, కౌన్సిలర్ మురళి, నాయకులు రత్నారెడ్డి, అనంత్‌రెడ్డి, జాఫర్, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్, కృష్ణారెడ్డి, రఘుపతిరెడ్డి, రెడ్యానాయక్, శ్రీనివాస్, నర్సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లో నిలిచిపోయిన డబుల్ ఇళ్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గురుకులాల అభివృద్ధికి కృషి చేయండి



నవీన్ నికోలస్‌ను సన్మానిస్తున్న అఖిల భారత గిరిజన సమాఖ్య ప్రతినిధులు

అనంతగిరి: గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి వాటి అభివృద్ధికి కృషి చేయాలని అఖిల భారత గిరిజన సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వెంకన్న నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్‌నాయక్ అన్నారు. ఇటీవల గురుకులాల కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నవీన్ నికోలస్, సోషల్ వెల్ఫేర్ శాఖ అదనపు డైరెక్టర్ హనుమంతునాయక్, గిరిజన శాఖ కార్యదర్శి సర్వేశ్వర్‌రెడ్డిలను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్ పవార్, సురేశ్ నాయక్, అఖిలేశ్ జాదవ్, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, యువజన నాయకుడు గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్



నిందితుడిని చూపుతున్న పోలీసులు

బషీరాబాద్: ఓ సెలూన్‌లో జరిగిన చోరీ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. ఈ నెల 16న మండల కేంద్రంలోని పోస్టాఫీసు పక్కన హెయిర్ సెలూన్ షాప్‌లో చోరీ జరిగింది. షాపు తాళాలు పగులకొట్టి రూ.7వేలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఈ నెల 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేసు విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం స్థానిక బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న క్యాద్గీరాకు చెందిన సిర్లిళ్లి సిద్దప్పను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడి వద్ద రూ.6వేలు రికవరీ చేసి తాండూరు కోర్టులో హాజరు పరిచారు. ఈ మేరకు న్యాయార్తి నిందితుడికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జుంటుపల్లి ఉధృతం..



జుంటుపల్లి అలుగు దిగువన ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

- నిలిచిన రాకపోకలు

యాలాల: కురుస్తున్న వర్షాలకు జుంటుపల్లి జలాశయం అలుగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన ఉద్దండరావు చెరువు అలుగు పారడం, అన్నారం వాగు వరద ప్రాజెక్టులోకి చేరుతుండటంతో పూర్తిస్థాయిలో నిండి జలకళను సంతరించుకుంది. జుంటుపల్లి ప్రాజెక్టు అలుగు దిగువన ఉన్న రహదారిపై నీటి ఉధృతి ఎక్కువగా కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో తాండూరు నుంచి రుద్రారం వరకు బస్సు సర్వీసు ఉంది. అలుగు నీటి ఉధృతి కారణంగా బస్సు రాకపోవడంతో పటేల్ చింతతండా వాసులు ఇబ్బందులు పడుతున్నారు. తండా ప్రజలు కాలినడకన పగిడిపల్లి వరకు వచ్చి, అక్కడి నుంచి తాండూరుకు చేరుకుంటున్నారు.

ఉద్యాన పంటలకు అనువు

- కూరగాయలు, పండ్ల తోటలకు ప్రభుత్వ ప్రోత్సాహం
- హార్టికల్చర్, సెరికల్చర్ అధికారి డాక్టర్ సునందారెడ్డి
- దెబ్బగూడలో అవకాడో పంట పరిశీలన



అవకాడో పంటను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

కందుకూరు: పండ్ల తోటలు, కూరగాయల సాగుకు రంగారెడ్డి జిల్లా అనువైన ప్రాంతమని, మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న అవకాడో పంటను సాగు చేసి మంచి లాభాలు ఆర్జించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి డాక్టర్ ఎస్.సునందారెడ్డి అన్నారు. దెబ్బడగూడ పరిధిలో రైతు జైపాల్ నాయక్ ప్రయోగాత్మకంగా సాగు చేసిన విదేశీ పంట అవకాడోను బుధవారం వారు సందర్శించారు. తెలంగాణలోనే మొట్టమొదటి సారిగా పండించిన పంటను పరిశీలించి రైతును అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అవకాడో ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఫలమన్నారు. తక్కువ ఉష్ణోగ్రతలో మాత్రమే దీన్ని సాగు చేయవచ్చని భావించే వారని, ప్రస్తుతం 35– 40 డిగ్రీల ఉష్ణోగ్రతను సైతం పంట తట్టుకుని నిలబడుతుందని నిరూపితమైందని తెలిపారు. అవకాడో సాగును ప్రోత్సహించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాలో పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నామని, ఎంత విస్తీర్ణంలోనైనా పంట వేసుకునే వీలుందని స్పష్టంచేశారు. 12.20 ఎకరాల వరకు డ్రిప్‌కు సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలకు 5 ఎకరాల వరకు రాయితీ అందజేస్తున్నామని, పట్టు పరిశ్రమను ఏర్పాటు చేసుకోవాలనే రైతులు తమను సంప్రదించాలని సూచించారు.

1.10 ఎకరంలో..

అవకాడో సాగుపై రైతు జైపాల్ నాయక్ అవగాహన కల్పించాడు. యూట్యూబ్‌లో చూసి సాగు వివరాలు తెలుసుకున్నానని, నాలుగేళ్ల క్రితం జడ్చర్ల వద్ద ఉన్న నర్సరీ నుంచి మొదట మూడు రకాల అవకాడో మొక్కలను తెచ్చి నాటగా.. కేవలం వెస్టిండియన్ గ్రీన్ రకం మాత్రమే మన వాతావరణాన్ని తట్టుకుందన్నారు. దీంతో 1.10 ఎకరంలో పంట సాగు చేశానని చెప్పాడు. 18 అడుగులకు ఒక మొక్కను నాటానని, పంట జీవిత కాలం 60– 70 సంవత్సరాలు ఉంటుందన్నాడు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులను తట్టుకునేలా నీడనిచ్చే మొక్కలు నాటుకోవాలని తెలిపాడు. మొక్కలకు ఎలాంటి చీడపీడలు ఆశించలేదని, ఆవు పేడ మాత్రమే ఎరువుగా వేశానని, పంట సాగు చేయాలనుకునే రైతులకు అవగాహన కల్పిస్తానని చెప్పాడు. కార్యక్రమంలో ఉద్యానశాఖ ఏడీ సంజయ్‌కుమార్, పట్టు పరిశ్రమశాఖ ఏడీ ముత్యాలు, హెచ్‌ఓ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.